క్లుప్తంగా

రామాలయ నిర్మాణ రాళ్లకు పూజలు



పొదలకూరు: పట్టణంలో రామాలయ ఆలయ నిర్మాణానికి ఉపయోగించే రాళ్లకు భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో ఉన్న ఆలయాన్ని తొలగించి కొత్తగా నిర్మిస్తున్నందున ఎలాంటి విఘ్నాలు కలుగకుండా పూర్తి కావాలని పూజించారు. మహిళా భక్తులతో పాటు ఉభయకర్తలు కోనం చినబ్రహ్మయ్య, తమ్ముల ప్రసాద్, మందా రామిరెడ్డి, ఆదూరు వెంకటసుబ్బయ్య తదితరులు పూజలో పాల్గొన్నారు.

కృష్ణపట్నం హైస్కూల్లో కంప్యూటర్ సెంటర్



కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఈఓ

ముత్తుకూరు(పొదలకూరు): అదానీ పోర్టు, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణపట్నం హైస్కూల్లో కంప్యూటర్ సెంటర్, సైన్స్ ల్యాబ్, లైబ్రెరీని పోర్ట్ సీఈఓ జగదీష్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన ఉండాలని కంప్యూటర్ సెంటర్‌ను ఏర్పాటు చేయించామన్నారు. సైన్స్ ల్యాబ్, లైబ్రెరీ కూడా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదానీ ఫౌండేషన్ నాణ్యమైన విద్య కోసం నిధులను వెచ్చిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ సతీమణి చాందినీ పటేల్, కుమారుడు యష్ పటేల్, హెచ్ఎం పి.సరళ, ఉపాధ్యాయుడు కోదండరామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగుల నిరసన



నెల్లూరు(బారకాసు): రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నగరపాలక సంస్థలో అన్ని విభాగాల కార్మికులు విధులను బుధవారం బహిష్కరించారు. తొమ్మిదో డివిజన్లో పారిశుద్ధ్య పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు పిలిచిన టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బారాషహీద్ దర్గా ప్రాంతం నుంచి భారీ ర్యాలీని నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయ ప్రధాన గేట్ వద్ద ధర్నాను చేపట్టారు. భారీగా మోహరించిన పోలీసులు.. కార్మికులను లోపలికి వెళ్లనీయకుండా గేట్ వద్దే అడ్డుకున్నారు. శిబిరం వద్దకొచ్చిన మేయర్ స్రవంతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నెల్లూరు నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, రూరల్ కార్యదర్శి పెంచలనరసయ్య మాట్లాడారు. కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు కార్మికుల పొట్టగొట్టడం తగదని హితవు పలికారు. సీఐటీయూ నెల్లూరు నగర కార్యదర్శి నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, నేతలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, సుధాకర్, కోటేశ్వరరావు, మాలకొండయ్య, డీవైఎఫ్ఐ నెల్లూరు నగర కార్యదర్శి నరసింహ, ఐద్వా నగర కార్యదర్శి కత్తి పద్మ, మట్టిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలకు 21న అంతరాయం

నెల్లూరు రూరల్: మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో పోస్టల్ సేవలను డిజిటలైజ్ చేస్తున్నామని, ఈ క్రమంలో పోస్టల్ సేవలకు ఈ నెల 21న అంతరాయం ఏర్పడనుందని తపాలా శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్లు

నెల్లూరు(బృందావనం): అక్కచెరువుపాడులోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండానే అడ్మిషన్లను నిర్వహిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి హైపా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 87126 25045 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వృత్తి పన్ను రద్దుకు వినతి

నెల్లూరు సిటీ: వృత్తి పన్నును రద్దు చేసే అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎల్ఐసీ ఏజెంట్లు కోరారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి నగరంలోని ఆయన కార్యాలయంలో వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు.

బూదవాగును పూడ్చేస్తున్నారు



నిడిముసలి గ్రామంలో ధ్వంసమైన కాలువ



రూపురేఖలు కోల్పోయిన కాలువ

- ధ్వంసమవుతున్న కట్టలు
- వరదలొస్తే ప్రమాదమే..

మండలంలో ప్రధాన కాలువ అయిన బూదవాగును కొందరు పూడ్చేస్తున్నారు. సొంత అవసరాల కోసం కాలువ కట్టలను ధ్వంసం చేయడం, వాటిని విస్తరించడంతో కుచించుకుపోతోంది. దీంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి రాబోవు రోజుల్లో వరద ముంచెత్తే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు.

ఇందుకూరుపేట: నెల్లూరు రూరల్ మండలం నుంచి వచ్చే బూదవాగు మండలంలోని పల్లిపాడు, నిడిముసలి, పున్నూరు వరకు, అక్కడి నుంచి రాముడుకాలువగా మారి ముదివర్తిపాళెం, కొమరిక గ్రామాల పొలాల మీదుగా పోతోంది. అక్కడి నుంచి గడ్ల కాలువ పేరుతో రాముడుపాళెం, గంగపట్నం నుంచి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ కాలువ ద్వారా వర్షాకాలంలో వచ్చే వరదనీరు సముద్రానికి చేరుతోంది. కాగా ఆయా గ్రామాల పరిధిలో వరద నీటి నుంచి రక్షణతో పాటు సుమారు ఐదు నుంచి ఆరు వేల ఎకరాల పంట పొలాలకు నీరు అందుతోంది. అలాగే రైతులు వరద నుంచి తమ పంట పొలాలను కాపాడుకొంటారు.

సొంత అవసరాలకు కట్టల ధ్వంసం

కాగా నిడిముసలి గ్రామంలోని కొందరు రైతులు వారి సొంత అవసరాల కోసం కాలువ కట్టలను యంత్రాల ద్వారా ధ్వంసం చేస్తున్నారు. దీంతో కట్టలు బలహీన పడడంతో పాటు కాలువ కుచించుకుపోయి కాలువ విస్తీర్ణం తగ్గిపోతోంది. ఫలితంగా కాలువలో నీటి ప్రవాహం సక్రమంగా సాగక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోందని ఈ ప్రాంత రైతులు, గ్రామస్తులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి ఆక్రమణలను నిలిపివేయాలని వారు కోరుతున్నారు.

ఎంతో నష్టం

బూదవాగు కాలువకు సంబంధించిన కట్టలను ధ్వంసం చేస్తున్నారు. సొంత ప్రయోజనాల కోసం కాలువను ఆక్రమించడం తదితర పనులు చేయడం వల్ల రానున్న రోజుల్ల వరదల బారిన పడి పంటలను నష్టపోవాల్సి వస్తుంది. దీంతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం ఖాయం.



– గొల్లపల్లి అవినాష్, పున్నూరు, ఇందుకూరుపేట మండలం

పంటలు మునిగిపోతాయి

నెల్లూరు రూరల్ మండలం నుంచి వచ్చిన వరద నీటితో పాటు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన వరద నీరు ఈ కాలువ ద్వారా సముద్రానికి వెళ్తుంటాయి. ఈ కాలువను ధ్వంసం చేయడంతో పాటు, ఆక్రమించేస్తున్నారు. దీంతో పంటలు మునిగిపోతాయి.



– వరిగొండ శ్రావణ్‌కుమార్, లేబూరు, ఇందుకూరుపేట మండలం

ఓటర్ల జాబితాను సరి చేయండి

తోటపల్లిగూడూరు : ఓటర్ల జాబితాలోని మార్పులు, చేర్పులను సరి చేయాలని తహసీల్దార్ పద్మావతి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో నూతనంగా మార్పులు, చేర్పులు, సవరణల ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ విషయంలో బీఎల్వోలు తగిన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్ల సూచనలు దృష్టిలో పెట్టుకుని పేర్ల మార్పులు, చేర్పులు, సవరణలను చేపట్టాలన్నారు. అలాగే 18 ఏళ్ల నిండిన అందరికీ నూతనంగా ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల గణాంకాధికారి రామ్‌ప్రసాద్, డీటీ శివయ్య, ఆర్ఐ యశ్వంత్, 50 మంది బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బీఎల్వోలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

బీఎల్వోలకు శిక్షణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం 41 మంది బూత్ లెవల్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చామని కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం) ఆదేశాల మేరకు బూత్‌లెవల్ అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. ఎన్నికల విధులు, నిర్వహణ తదితర అంశాలపై పలువురు అధికారులు అడిగిన సందేహాలను నివృత్తి చేశామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నలుగురి అరెస్ట్

తోటపల్లిగూడూరు: ఓ వ్యక్తిపై జరిగిన దాడి కేసులో నలుగురిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన వరిగొండ పంచాయతీ తట్టుగొల్లపాళెం గ్రామానికి చెందిన షేక్.సత్తార్ అనే వ్యక్తిపై పాత గొడవల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేసి గాయపరిచారని తెలియజేశారు. బాధితుడి ఫిర్యాదులో భాగంగా దాడి కేసులో నిందితులైన షేక్.షాహుల్, సర్దార్, దావూద్, సుబానీలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి డైట్ సెట్ కౌన్సెలింగ్

ఇందుకూరుపేట: డైట్ సెట్–2025 ఫేజ్–1 కౌన్సెలింగ్ ఈనెల 17వ తేదీ నుంచి 22 వరకు ఉంటుందని పల్లిపాడులోని డైట్ కళాశాల ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. స్థానిక కళాశాలలో జరిగే కన్సెలింగ్ ప్రక్రియకు అభ్యర్థులు తప్పనిసరిగా వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు అవసరమైన ఇతర డాక్యుమెంట్లతో హాజరు కావాలని కోరారు.

పోలీసుల పెట్రోలింగ్

నెల్లూరు సిటీ: వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్‌ను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. వెంగళరావునగర్‌లోని ఏ, బీ బ్లాక్‌లలో పర్యటించారు.



ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

కోవూరు: ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం మండలంలో పనిచేస్తున్న కూలీల సంఖ్యను 612 నుంచి వెయ్యికి పెంచేలా ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఎఫ్ఏలతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ప్రభుత్వం రోజుకు రూ.307 చొప్పున వేతనం అందజేస్తోందన్నారు. కూలీల హాజరును ప్రతిరోజూ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. పనుల్లో పారదర్శకత, నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ప్రయోజనాలు కూలీలకు పూర్తిగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

కోవూరు: పెండింగ్ కేసుల పరిష్కారం కోసం కోర్టు చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా, రాజీకి అవకాశం ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి పి.చైతన్య తెలిపారు. కోవూరు కోర్టు ప్రాంగణం నుంచి 'మధ్య వర్తిత్వం – దేశం కోసం'పై అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి చైతన్య మాట్లాడుతూ, గ్రామాల్లో చిన్నపాటి వివాదాలు, ఆస్తి తగాదాలు వంటివి కోర్టులకు వెళ్లకుండా మధ్యవర్తుల సహకారంతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల సమయం, ధనం ఆదా అవుతాయని సూచించారు. కక్షిదారులు వినియోగించుకుని సకాలంలో కేసులు ముగించుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో స్పెషల్ మ్యాజిస్ట్రేట్ జె.కృష్ణయ్య, కోవూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ చంద్రమోహన్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కోవూరులో అవగాహన ర్యాలీ

1,200 ఓట్లు మించితే కొత్త పోలింగ్ బూత్

కోవూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో గరిష్టంగా 1,200 ఓట్లకే అవకాశం ఉందని, ఆ సంఖ్య మించితే కొత్త పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తామని కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. మండలంలోని చుండుగుంట, పోతిరెడ్డిపాళెం, పాత పడుగుపాడు ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన బుధవారం పరిశీలించారు. మూడు పోలింగ్ బూత్‌లో 1,200కి మించి ఓట్లు ఉండటాన్ని పరిశీలించామని, దీంతో సంబంధిత ప్రాంతాల్లో మరో పోలింగ్ స్టేషన్ను ఏర్పాటు చేసే ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు. అదేవిధంగా 18 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటరు గుర్తింపు కోసం నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సురేష్, బీఎల్వోలు శ్రీనివాసులురెడ్డి, ఇమామ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్

గొలగమూడి విద్యార్థినుల ప్రతిభ

వెంకటాచలం: గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో వెంకటాచలం మండలంలోని గొలగమూడి వద్దనున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈనెల 12, 13 తేదీల్లో తిరుపతిలోని గిరిజన భవన్‌లో గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్ విభాగంలో గొలగమూడిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని పి.మానస 30 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. నాలుగో తరగతి విద్యార్థిని పి.స్పందన 27 కేజీల విభాగంలో వెండి పతకం సాధించారు. ప్రతిభ చూపిన వీరిని గొలగమూడిలో పాఠశాల ప్రిన్సిపల్ బి.లక్ష్మీకామేశ్వరిదేవి, వ్యాయామ ఉపాధ్యాయిని షేక్.షబిక, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న టీచర్లు

అదుపుతప్పి లారీ బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు

కొడవలూరు: లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని రాచర్లపాడు వద్ద బుధవారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు.. గుంటూరు నుంచి చెన్నైకు మిర్చి లోడ్‌తో వెళ్తున్న లారీ రాచర్లపాడు వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన డ్రైవర్‌కు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు ఎస్సై కోటిరెడ్డి తెలిపారు. డ్రైవర్ కునుకుతీయడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అయన పేర్కొన్నారు.



రాచర్లపాడు వద్ద బోల్తా పడిన లారీ

సమస్యలపై ఏకరవు

కొడవలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గాలి జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఇందులో పలు సమస్యలపై సభ్యులు ఏకరవు పెట్టారు. చౌక డిపో డీలర్‌లు దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే సరుకులు ఇవ్వాల్సి ఉన్నా అందించడం లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి సమాధానమిస్తూ ఇలాంటి సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని, పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గండవరం సర్పంచ్ రాజకుమారి మాట్లాడుతూ గ్రామానికి త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని నాలుగేళ్లగా కోరుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. విద్యుత్ శాఖ ఏఈ ఎం.రాములు సమాధానమిస్తూ నెల రోజుల్లో త్రీ ఫేజ్ లైన్ను ఏర్పాటు చేస్తామన్నారు. కొడవలూరు బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు నిలుపకపోవడం వల్ల గ్రామస్తులు, విద్యార్థులు ఎంతగానో ఇబ్బంది పడుతున్నట్లు సభలో తెలిపారు. సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్టీసీ ప్రతినిధి సభలో స్పష్టం చేశారు. ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ కొత్తగా వివిధ శాఖల అధికారులు మండలానికి వచ్చినందున అందరూ సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మారంరెడ్డి సుజాతమ్మ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారావు

ప్రమాదకరంగా ప్రయాణం



రాత్రి వేళ హైవేపై ఆటో వెనుక కూర్చుని ప్రయాణిస్తున్న మహిళలు

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఆటోలు ఇష్టానుసారంగా ప్రయాణికులను ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు మడమనూరు, వీరంపల్లి, అక్కంపేట, బండేపల్లి, గురివిందపూడి, కొమ్మలపూడి, కొండూరుసత్రం, కాగితాలపూరు, పిడూరు, బద్దెవోలు తదితర గ్రామాలకు చెందిన వందలాది మంది వివిధ పనుల నిమిత్తం నిత్యం గూడూరు, నెల్లూరుకు ప్రయాణాలు సాగిస్తుంటారు. అయితే ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులు ఎక్కువగా లేకపోవడంతో పాటు ఉన్న బస్సులు కూడా సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితిలో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆటోవాలాలు అత్యాశతో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సీట్లోనే కాకుండా ఆటోకు వెనుక వైపు కూడా ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. రాత్రి పూట సైతం ఒక్కో ఆటో 10 నుంచి 15 మంది ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలను హైవేపై నడుపుతున్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంట వివరాలను నమోదు చేసుకోవాలి

కొడవలూరు: ప్రతి రైతు వారి పంట వివరాలను నమోదు చేసుకోవాలని ఏఓ ఎస్.విజయలక్ష్మి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ రాయితీలు వర్తించాలంటే విధిగా పంట వివరాలు నమోదు చేసుకోవాలని చెప్పారు. జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం రాయితీతో ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాల సాగుతో భూమి సారవంతమై దిగుబడులు మెరుగు పడతాయని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ నిహారిక, రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

విడవలూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకురాలు జి.అనిత అన్నారు. మండలంలోని ఊటుకూరు, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. వేరుశనగలో పసుపు రంగు అట్టలను అమర్చడం ద్వారా కీటకాలు, పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చని సూచించారు. అనంతరం పలువురి రైతుల పొలాలను సందర్శించి వివిధ రకాల తెగుళ్లు, పురుగు మందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయాధికారి లక్ష్మీ, వీఏఏలు చెంచులక్ష్మి, ప్రవీణ్, శ్రావ్య పాల్గొన్నారు.



విడవలూరు: వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

కౌలు రైతులు కార్డులు పొందాలి

కోవూరు: కౌలు రైతులు తప్పనిసరిగా ప్రభుత్వ కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారిణి టి.రజని సూచించారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం, గంగవరం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. కౌలు రైతు కార్డు ఉంటే పచ్చిరొట్ట విత్తనాలు, ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే సాగు చేసే రైతులు ఆగస్టు 15లోపు పంట బీమా కోసం నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..



కోవూరు మండలంలో..